# ఉపవాస ప్రార్థన ప్రకరణము

ఉదయము 6 గంటలకు ఆరంభించి సాయంకాలము 6 గంటలకు ముగించవలెను. ఉదయం 5 గంటలకే లేచి స్నానము చేయవలెను. మత్తయి 6:16–18 ప్రకారము ప్రతి అంశము ప్రార్థించి, స్తుతించి 'యెహోవ నా మొరలాలించెను' అను పాట పాడవలెను.

# మనోనిదానపు ప్రకరణము

**ఎ) మల్లుమెట్టు:–** అనగా మరుపుమెట్టు. ఈ మెట్టుపై అన్నీ మరచిపోవలెను. 1) నీలో ఉన్న పొరపాట్లు అన్ని మరచిపోవలెను. 2) నీకున్న కష్టములను మరచిపోవలెను. 3) నీకున్న సదుపాయములను మరచిపోవలెను. 4) నీ స్వజనులను మరచిపోవలెను. 5) నీవేమి ప్రార్థింప దలంచుకొన్నావో, ఆ అంశములను మరచిపోవలెను. 6) ఆకాశము, భూమి, మోక్షలోకము, పాతాళలోకము, గతకాలము, నవీన కాలము అన్నీ మరచిపోవలెను. 7) దయ్యములను, దుష్టులను కూడ మరచి పోవలెను. పైవన్ని రాకమానవు కాని రానీయకూడదు. అన్నీ మరచిపోవుట వల్ల నీ హృదయమును ప్రార్థనకు ఖాళీచేయవలెను. అవి జ్ఞాపకము రాకుండా ప్రయత్నించవలెను.

**బి) విజ్ఞప్తి:–** 1) యేసుప్రభువును మాత్రమే తలంచవలెను, ఆయన నీ ఎదుట ఉన్నాడని తలంచవలెను, 2) నీవు చేసిన ప్రార్థన వినుటకు వచ్చెనని తలంచవలెను, 3) నిన్ను బలపర్చుటకు వచ్చెనని తలంచవలెను,0 4) నిన్ను శుద్ధిచేయుటకు వచ్చెనని తలంచవలెను, 5) ఇద్దరు ముగ్గురుండు చోట ఉంటాననే వాగ్దానము నెరవేర్చుటకు వచ్చెనని

తలంచవలెను, 6) నేనే దేవుడనని, నేనే నీ రక్షకుడనని, ఋజువు పరచుటకు వచ్చెనని తలంచవలెను.

**షరా:-** ఫోటో తీయునపుడు లెన్స్ వైపు (కెమేరా అద్దమువైపు) చూచునట్లుగా, మనో నిదానముతో ప్రభువువైపే చూడవలెను.

# నమస్కారపు ప్రకరణము

ప్రభువునకు నీ ఇష్టము వచ్చినట్లు నమస్కారము చేయుము, 1) ప్రభువా! నీవు నా యెదుట ఉన్నందుకు నమస్కారము, 2) నేను చేయు ప్రార్థన వినుటకు వచ్చినావు గనుక నమస్కారము, 3) నన్ను బలపరచుటకు వచ్చినావు గనుక నమస్కారము, 4) నాతో మాట్లాడుటకు వచ్చినావు గనుక నమస్కారము, 5) నన్ను రక్షించుటకై వచ్చినావు గనుక నమస్కారము.

# శుద్ధి ప్రకరణము

**ఒప్పుదల: -** 1) పది ఆజ్ఞలనుబట్టి పరీక్ష చేసికొనవలెను. 2) నీలోఉన్న పొరపాట్లు, తప్పులు, నేరములు, పాపములు ఒప్పుకొనవలెను. చేయకూడనివి ఏవి చేసినావో, చేయవలసినవి ఏవి చేయలేదో వాటిని ఒప్పుకొనవలెను. తలంపు, మాటలు, ప్రయత్నములలోని పాపములు ఒప్పుకొనవలెను. (ఏకాంత స్థలము కోరుము అనే కీర్తనలో 1,2,3 వచనములు). 4) దేవునిమీద ఎప్పుడైనను విసుగుకొన్నావా? 5) జంతువులకు సరిగా ఆహారము పెట్టకపోవుట. (ఏకాంత స్థలము కోరుము అనే కీర్తనలో 15వ వచనము). 6) దేవుడు నీకిచ్చిన వస్తువులను జాగ్రత్తగా వాడకపోవుట. 7) నీకుండకు చిల్లిపడితే దానిని పూడ్చనందున నీళ్ళన్నీ కారిపోవును. ఇది అజాగ్రత్త పాపము. 8) దేవుడిచ్చిన శరీరమును సరిగా శుభ్రము చేయకపోవుట, అరికాళ్ళు కడుగుకొనకుండా కాళ్ళు కడుగుట. 9) పరులకు

విరోధముగా చేసినవి (ఏకాంత స్థలము కోరుము అనే కీర్తనలో 5వ వచనము).
10) ఇతరులకు చేయవలసిన ఉపకారములు చేయకపోవుట. **షరా:-** ఒకరికి ఒక రూపాయి ఇవ్వాలనుకొని ఇవ్వకపోవుట. జబ్బుగా నున్న ఒక వ్యక్తి దగ్గర ప్రార్థన చేయాలనుకొని చేయకపోవుట.

# 10 ఆజ్ఞల వివరము

**1వ ఆజ్ఞ:- నిర్గమ 20:2-4 (నీ దేవుడనైన యెహోవాను నేనే; నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పైన ఆకాశమందేగాని, క్రింది భూమియందేగాని భూమిక్రింద నీళ్ళయందేగాని యుండు దేని రూపమునైనను విగ్రహమునైనను నీవు చేసికొన కూడదు వాటికి సాగిలపడకూడదు వాటిని పూజింపకూడదు).**

## దేవునికి బదులుగానుండు ప్రతిదియు పాపము

**బహిరంగ విగ్రహము:** సొమ్మును, కీర్తిని, పనిని, సౌఖ్యమును, మందులను, విద్యను, జనమును, ఆస్తిని, పొలములను, పశ్వాదులను, ఇండ్లను, పుస్తకాలను, తోటలను, ఆరోగ్యము; పైవాటిని దేవునికంటె ఎక్కువగా ప్రేమించరాదు, నమ్మరాదు, చింత గలవారు దేవునిని నమ్మనట్లే.

**భయపడుట:** కరవులకు, వ్యాధులకు, విష పురుగులకు, క్రూర జంతువులకు, నిందలకు, దయ్యములకు, గాలి వానలకు, వరదలకు, పిడుగులకు, ఉరుములకు, భూకంపములకు, దొంగలకు, మరణమునకు, నరకమునకు, దుష్ట స్వప్నములకు, తలంచని పాపములకు, పై వాటికి భయపడరాదు.

**నాస్తికత్వము:** దేవుని తలంపు లేకుండుట, దేవుని యెడల నిర్లక్ష్యము, దేవుని సంగతుల యెడల నిర్లక్ష్యము, దైవ విషయములలో

మందము, దేవుడు చూడనట్లు చూచుట, ప్రతిపనిలో ఆదిని, దేవునిని తలంచకుండుట, దేవుడున్నాడనునది అనిశ్చయము, దైవ విషయములు తెలిసికొనకుండుట, మూఢభక్తి కలిగియుండుట.

**చేయవలసిన విధులు:** 1) కొంత నేను, కొంత దేవుడు ఉండకూడదు, దైవ భయము ఉండవలెను. దాసభయము కూడదు. 2) శిశు భీతి ఉండవలెను. 3) దైవ ప్రేమకలిగి ఉండవలెను. 4) నమ్ముట అనగా సమస్తమైన వాటికంటె దేవునిని నమ్మవలెను.

**షరా:-** దేవునిని నమ్మితే చింత ఉండదు, దేవునిని నమ్మితే ఆనందముండును, దేవునిని నమ్మితే దైవభక్తి ఉండును.

**2వ ఆజ్ఞ:- నిర్గమ 20:7 (నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు; యెహోవా తన నామమును వ్యర్థముగా నుచ్చరింపు వానిని నిర్దోషిగా ఎంచడు).**

**(ఎ) దైవ నామమును ఆలోచించకుండ ఎత్తుట:-** నిద్రలో ఉలికిపడగా ఎత్తుట, భక్తి లేకుండా వాక్యము చదువుట, భక్తిలేకుండా ప్రార్థించుట, భక్తిలేకుండా పాడుట, భక్తులను హేళనచేయుట, పవిత్ర సంగతులను హేళన చేయుట.

**(బి) శపించుట:-** ఒకరికి కీడు రావలెనని కోరుట, వారికి కీడు రాగా ఆనందించుట, శాపము తొలగనందున ఆనంద లేమి కలిగి యుండుట.

**(సి) ఒట్టు:-** సంభాషణలలో, పంచాయితీలలో, కోర్టులలో, ఊహించుటలో ఒట్టుపెట్టుకొనుట.

**(డి) మంత్రములు:-** సోదె, సాముద్రికము, జ్యోతిష్యము, అశుభ భీతి, రహస్యములు తెలిసికొనుట.

**(ఇ) అబద్ధములు:** బోధలలో కల్పనలు.

**(ఎఫ్) వంచన:** వేషధారణ, లోకాశలలను కలిగి సేవచేయుట.

**విధులు:–** శ్రమలో, ఇబ్బందిలో, ప్రార్థనలో, స్తుతిలో దుర్బుద్ధిని పారద్రోలుట. పాటలలో, ఉత్తరాలలో, దైవనామమును ఉచ్ఛరించవలెను.

**3వ ఆజ్ఞ:– నిర్గమ 20:8 (విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము).**

***చేయవలసినవి: యెషయా 58:6-14.***

**చేయకూడనివి:–** వాక్యమును తిరస్కరించుట, గుడికి క్రమముగా వెళ్ళకపోవుట, గుడిలో పరధ్యానము కలిగియుండుట మొదలగు పనులు చేయరాదు. బజారుకు వెళ్ళవద్దు, ఒకవేళ మనము ఇంటికి వచ్చినా ఏమీ కొనకూడదు. వార్తా పత్రికలు చదువవద్దు. శరీర సంబంధ విందులు కూడదు. ఉత్తరాల వ్రాతలు కూడదు.

**చేయవలసినవి:–** బైబిలు చదువుట, ప్రార్థన చేయుట, కీర్తనలు పాడుట, బైబిలు నేర్పుట, బైబిలు నేర్చుకొనుట.

**4వ ఆజ్ఞ:– నిర్గమ 20:12 (నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని, నీ తల్లిని సన్మానింపుము).**

**చేయవలసినవి:–** తల్లిదండ్రులను, అన్నదమ్ములను, అక్క చెల్లెండ్రను, మారు తల్లిదండ్రులను, బంధువులను, స్నేహితులను, పాస్టర్లను, మిషనెరీలను, పంతుళ్ళను, సువార్తికులను, రాజులను, కోర్టులను, ఉద్యోగస్తులను, మనకంటే పెద్దవారలను, చిన్నవారైనను గౌరవ పాత్రులైన ఉద్యోగస్తులైనవారిని గౌరవించవలెను. ఎవరిని నీచముగా ఎంచవద్దు.

**5వ ఆజ్ఞ:- నిర్గమ 20:13 *(నరహత్య చేయకూడదు).***

**చేయకూడనివి లేక ఉండకూడనివి:-** కోపము, వైరము, పగ, ఓర్వలేనితనము, అసూయ, పోట్లాడుట, కొట్టుట, యుద్ధము, ద్వేషము, త్రాగుట, అశ్రద్ధ, అనాగరికత, అశుభ్రత, దుఃఖపెట్టుట, జబ్బుపడుట, బాగుచేయింపకుండుట, హత్య, స్వహత్య, తిండిబోతుతనము, తిండి బాగా తినకుండుట, మితిమీరి తినుట, స్నానము చేయకుండుట. కులము హానికరము, బాల్య వివాహము కూడదు.

**చేయవలసినవి:-** బీదలకు, రోగులకు, విచారగ్రస్తులకు, అనాథ శాలలకు, వైద్యశాలలకు, సత్రములకు సహాయ పడవలెను. సమయానుకూల ఉపవాసము చేయవలెను. జీవరాసులను బాధింపవద్దు. చెట్లను, కొమ్మలను అనవసరముగా నరకరాదు. జీవరాసులకు తగిన మేత పెట్టవలెను.

**6వ ఆజ్ఞ:- నిర్గమ 20:14 *(వ్యభిచరింపకూడదు).***

**చేయకూడనివి:-** చెడు తలంపులు, బూతులు, చెడు సంభాషణలు, దుర్నీతి కథలు, దుర్నీతి పాటలు, పరిహాసములు. చెడు బొమ్మలు, గృహజీవన ఐక్యత లేకపోవుట; పైవాటిని విడిచి పెట్టవలెను. 1) మేనరికము కూడదు, 2) ఏకమతస్థులై యుండవలెను.

**7వ ఆజ్ఞ:- నిర్గమ 20:15 *(దొంగిలకూడదు).***

**చేయకూడనివి:-** దొంగతనము, దూబరి తనము, నిర్వ్యాపారము, మోసపుపనులు, చోరి, ఆస్తిని దాచుట, దొరికినవి దాచుట, అరువు తెచ్చుకొని ఇవ్వకుండుట, అప్పు తీర్చకుండుట, పనిలో బద్ధకము, బలముండి భిక్షమెత్తుట, పందెములు, జూదములు, లాటరీలు, లంచాలు, వ్యాజ్యాలు, టిక్కెట్లు లేకుండా ప్రయాణం చేయుట, పనిలో అపనమ్మకము,

స్వల్ప జీతములిచ్చుట, ఎక్కువ ధరలు, ఎక్కువ వడ్డీ, దగా పాలు, పిచ్చి కొలతలు, పశువులను వేరొకరి పొలములోనికి తోలుట, అనవసరముగా ఆస్తిని పాడుచేయుట, దేవుని దొంగిలించుట అనగా దశమభాగమును ఇవ్వకుండుట.

**చేయవలసినవి:–** 1) పొదుపరితనము, 2) ఆస్తిని సద్వినియోగము చేయుట, 3) ధర్మము చేయుట, 4) దేవుడిచ్చినవి సరిగా అనుభవించుట.

**8వ ఆజ్ఞ:– నిర్గమ 20:16 (నీ పొరుగువాని మీద అబద్ధసాక్ష్యము పలుక కూడదు).**

**చేయకూడనివి:–** అసత్యము, మంచిపేరు చెడగొట్టుట, గుట్టు బైట పెట్టుట, స్నేహితుని పట్టించుట, చాడీలు, చెడ్డ వదంతులు, కొద్ది తప్పు కొండంత చేయుట, తప్పు అర్థము చేసికొనుట, సరిగా గ్రహింప కుండుట, చెడ్డవి అగుపడునట్లు చేయుట, మోసము, మాయవేషము, పెద్ద తప్పును స్వల్పపరచుట, పొగడుట, మాట నిలుపుకొనలేకపోవుట, నవ్వులాటలు, అబద్ధాలు, అనవసర అబద్ధాలు, వట్టి ఊహలు, నష్టములేని అబద్ధాలు.

**చేయవలసినవి:–** సత్యముగా నడచుట, మంచిపేరు కాపాడుట, సత్య విషయమై ప్రాణము పెట్టుట (హతసాక్షి కావచ్చును), ఇతరులు మంచిని చెప్పుకొనుట, కాపాడుట.

**9వ ఆజ్ఞ & 10వ ఆజ్ఞ:– నిర్గమ 20:17 (నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు. నీ పొరుగువాని భార్యనైనను, అతని దాసునైనను, అతని దాసినైనను, అతని యెద్దునైనను, అతని గాడిదనైనను, నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు).**

**చేయకూడనివి:-** అత్యాశ, పాపనైజము, జన్మపాపము, హక్కు లేనివి కావలెననుట, అన్యాయముగా సంపాదింపకోరుట, ఇతరుల ఆస్తిని చూచి అసూయపడుట, లాలస, ఇచ్ఛము, బెదిరించుట, విడదీయుట.

**చేయవలసినవి:-** ఇతరులవి వారికి ఇచ్చుట, మనస్సాక్షి చెప్పునది చేయుట, మనస్సాక్షిని కప్పివేయరాదు. 'ఏకాంత స్థలము కోరుము' అనే కీర్తన పాడవలెను. నీ పాపములు క్షమింపబడెనని స్తుతించి, కొంతసేపు కనిపెట్టవలెను.

**తీర్మానపు ప్రకరణము:-** ఇది చిన్నదైనను గడ్డైనది. నాకు తెలిసిన ఏ పాపమును, ఏ పొరపాటునైనను చేయకుండా ఉంటానని దేవుని యెదుట తీర్మానము  చేసికొనవలెను.

**సమర్పణ ప్రకరణము:-** 1) యేసుప్రభువా! నా శరీరము నీకే సమర్పణ చేయుచున్నాను. 2) నా ఆత్మ, 3) నా ప్రాణము, 4) నా జ్ఞానము, 5) నా మనస్సాక్షి, 6) నా ఆస్థియంతా, 7) నా కోరికలన్ని, 8) నా ప్రార్ధనలన్ని, 9) నా మనవులన్ని, 10) నా గతకాలము, 11) నా నవీన కాలము, 12) నా భావి కాలము, 13) నా నష్టాలు, 14) నా సదుపాయములు, 15) నా సేవ, 16) నా స్వజనులు అన్నియు నీకే సమర్పించుచున్నాను.

***'నీవేయని నమ్మిక', 'తనువు నాదిదిగో'*** అనే కీర్తనలు పాడుకొనవలెను. దావీదు కీర్తన 25, 31 అధ్యాయములు చదువవలెను.

**వృద్ధి ప్రకరణము:-**

**వ్రతము మెట్టు:-** 1) తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు త్రియేక దేవుడైయున్నారు. 2) కుమారుడు, యేసుక్రీస్తను పేరుమీద భూమిమీద వెలసియున్నారు. 3) క్రీస్తు స్థాపించిన క్రైస్తవ మతమే రక్షణ మతము.

4) పాపము చేయకూడదు. 5) పిశాచిని అనుసరింపకూడదు. 6) దేవదూతలు నాకు సహాయకారులై యున్నారు. 7) ఎవరు ఏమి బోధించినను అది నాకాధారము కాదు, బైబిలే నాకాధారము. 8) క్రీస్తుప్రభువు నన్ను నరకమునుండి తప్పించును. 9) ఆయన నన్ను మోక్షమునకు తప్పక తీసికొని వెళ్ళును.

**ఇదే నా వ్రతము, ఇదే నా మతము, ఇదే నా హితము.** కష్టములు, సందేహములు వచ్చినను, ఇదే నేను ధ్యానించవలసినదై యున్నది. ఈ వ్రతము నా నైజమై యున్నది. ఇదే నా విశ్వాసమై యున్నది.

1) నా నైజము పాపనైజమై యుండే సమయములో నేను నా వ్రతములోనే నిలిచియుండెదను.

2) పాపక్రియలు, నా బలహీనతనుబట్టి నా తీర్మానమునకు భిన్నముగా ఏదైనా పాపములో పడినప్పుడు సహితము, ఇదే నేను ధ్యానించుచుందును. ఇది నా వ్రతము.

3) కష్టములు అనగా ఇబ్బందులు, జబ్బులు, చిక్కులున్నప్పుడు సహితము ఇదే నా వ్రతము.

4) నేను ఏది అడిగినను, దేవుడు నాకివ్వకపోయినను ఇదే నా వ్రతము. నాకు సంగతులు అర్థము కానప్పుడు, సణుగుకొనుటకంటె ఊరుకొనుట నాకు క్షేమము. ఇదే నా వ్రతము.

5) సంఘము, క్రైస్తవులు అనగా అన్ని మిషనుల క్రైస్తవులు, బోధకులు, తప్పిపోవుట నాకు కనబడినను నేను నా వ్రతమును వదలను.

6) ప్రపంచములోని వారందరు క్రీస్తుమతము తప్పు అని బోధించు చున్నప్పుడు సహితము నేను నా వ్రతమును మానను. ఇదే నా వ్రతము.

7) భూమి, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు నేను ఎరిగియున్న సమస్తమును నశింపులోకి వచ్చేటప్పుడు సహితము ఇదే నా వ్రతము.

8) నాకు దుస్థితి వచ్చినను ఇదే నా వ్రతము.

9) ఇంకను చెడగొట్టేవి ఏమైనను ఉన్నప్పుడు సహితము ఇదే నా వ్రతము. ఏదైనను నశించును గాని నా వ్రతము నశించదు.

నరకములోనికి వెళ్ళినను, అక్కడను నా వ్రతమును జ్ఞాపకము తెచ్చుకొందును. 'నీవు పాతాళములోనికి దిగినను నేనక్కడ ఉన్నానని' అన్నాడు. గనుక నా వ్రతము నెరవేరును.

10) 'దుస్థితి' పాపము వచ్చినను, ఇదే నా వ్రతమని తీర్మానము చేసికొనుచున్నాను. అవి రావలెనని కాదు. అవి రాకుండ నా శక్తికొలది ప్రయత్నము చేయుదును. **ఎన్నిటిని విడిచినను, ఈ నా వ్రతము విడువను.**

**(ఎ) వ్రతము మెట్టు:** యేసుప్రభువా! ఎన్ని కష్టములు వచ్చినా నిన్ను విడిచిపెట్టను, నిన్ను మరచిపోను. యేసుప్రభువా! ఎంత సుఖమున్నా, అన్ని కాలములలో, అన్ని వేళలలో, అన్ని స్థలములలో, అన్ని పనులలో, అన్ని స్థితులలో, ఏమిచేసినా, ఎక్కడున్నా, నిన్ను విడిచిపెట్టను. నిన్ను మరచిపోను. నిన్నే జ్ఞాపకము తెచ్చుకుంటాను. నిన్ను మరచుట నాకు సాధ్యము. నిద్రలో మెళుకువ రాగానే నిన్నే తలంతును. నా ప్రార్ధన నెరవేరినా, నెరవేరకపోయినను నిన్నే తలంచుకుంటాను. నిన్నే ప్రార్ధించెదను, నిన్నే స్తుతించుదును. నిన్నే సేవించుదును. నిన్నే ప్రకటించెదను. ఏ దయ్యమైనా, ఏ దుష్టుడైనా, ఏ జీవరాశియైనా, ఏ కష్టమైన, ఏ సుఖమైన నాలోనుండి ఏమైన తీసివేయగలరు గానీ ఈ నా వ్రతమును తీసివేయజాలరు.

**(బి) నిరుకుమెట్టు:–** ఇకమీదట నీ వాక్యము ప్రతిదినము ధ్యానింతును. ప్రతి దినము ప్రార్ధింతును. అందరికొరకు ప్రార్ధింతును. అన్నిటికొరకు స్తుతింతును. ఎవరో ఒకరికైనను వాక్యము చెప్పెదను. గుడికి క్రమముగా వెళ్ళెదను. నా కానుక (దశమ భాగము) ఇచ్చెదను. నా విధులన్ని నెరవేర్చెదను.

**(సి)** ఇదివరకే నాకు ప్రార్ధన, స్తుతి, బైబిలు చదువుట, విశ్వాసము, చందావేయుట, పవిత్రత, జ్ఞానము మొదలైనవి ఉన్నవి గాని నేనిప్పుడు కోరుకొనేది 'నన్ను వృద్ధిచేయుమని',

'యేసును జూచుట' అను కీర్తన పాడవలెను. దావీదు కీర్తన 119 చదివి కొంత విశ్రాంతి తీసికొనవలెను.

**విజ్ఞాపన ప్రార్ధన:–**

**(ఎ)** భూగోళమంతటి ప్రకారము దేశములు, పట్టణములు మొదలైనవన్ని జ్ఞాపకము చేసికొని, అక్కడున్న వారిని జ్ఞాపకము చేసికొని, వారిని గురించి ప్రార్ధించవలెను. అన్ని మతములు, అన్ని మిషనులు, అన్ని ఆజ్ఞలు అనుసరించని వారిని గురించి ప్రార్ధించవలెను. ఒక్క మనిషినైనను మరచి పోకూడదు. మంచివారిని గురించి, భక్తులను గురించి, పెండ్లికుమార్తెను గురించి ప్రార్ధించవలెను. యోహాను సువార్త 17వ అధ్యాయము చదివి, 'ఎంతో సుందరమైనవి' అను కీర్తన పాడుకొని, కొంత సమయము 'విశ్రాంతి' తీసికొనవలెను.

**(బి) 1. ఆజ్ఞ:–** విగ్రహారాధికులు, నాస్తికులు, అనిశ్చయపరులు, దేవుడు గల నాస్తికులు, దేవునికంటె సృష్టిలోని వాటిని ఎక్కువగా ప్రేమించువారు.

**2. ఆజ్ఞ:-** దేవదూషకులు, నిర్భయముగా దేవుని నామమున ప్రమాణము చేయువారు, దేవునిని స్తుతించనివారు.

**3. ఆజ్ఞ:-** ఆదివారమనగా లెక్కలేనివారు, ఆరాధనయందు గౌరవము లేనివారు, ఆదివారమును గౌరవింపనివారు.

**4. ఆజ్ఞ:-** తల్లిదండ్రులను గౌరవింపనివారు, పెద్దలను గౌరవింపనివారు, మంచిస్థితి గలవారిని గౌరవింపనివారు.

**5. ఆజ్ఞ:-** నరహంతకులు, ఉపకారము చేయనివారు, ఆరోగ్యము కాపాడుకొననివారు, అన్యాయముగా యుద్ధములలో పాల్గొనినవారు.

**6. ఆజ్ఞ:-** వ్యభిచారులు, కుటుంబములలో సమాధానము లేనివారు.

**7. ఆజ్ఞ:-** దొంగతనము చేయువారు, అన్యాయ వర్తకులు, దశమ భాగమియ్యనివారు, దేవుడిచ్చు దానములను సరిగా వాడుకొననివారు, సరుకులను పాడుచేయువారు.

**8. ఆజ్ఞ:-** కోర్టులలో అబద్ధ సాక్ష్యము పలుకువారు, ఇతరులను గూర్చి అల్లరి చేయువారు, చాడీలు చెప్పువారు, ఇతరుల గొప్పస్థితిని గూర్చి మంచిగా మాట్లాడనివారు.

**9,10. ఆజ్ఞలు:-** ఆశించకూడనిది ఏదైననుసరే ఆశించువారు, దురాలోచన గలవారు, ప్రతిదానిని తప్పు అర్థము చేయువారు, అనుమాన పడువారు, చెడ్డ సంగతులు కల్పించువారు, అబద్ధికులు, మంచిని చెడుగాను మరియు చెడును మంచిగాను మార్చి చెప్పువారు, కలహములు పెట్టువారు, పిసినితనము గలవారు, కపటాలోచన గలవారు, కృపను ద్వేషించువారు, మనస్సాక్షిని ఎదిరించువారు, ఏదియు నమ్మనివారు, స్వలాభము చూచు

కొనువారు, తిండిబోతులు, జూదగాళ్ళు, అప్పులు పాలగువారు, శక్తిపూజ చేయువారు, క్రీస్తు మత ద్వేషకులు, బైబిలు భావములు పెడర్ధములు చేయువారు, శుద్ధి శుభ్రత లేనివారు మొదలగు వారిని గూర్చి ప్రార్ధించ వలెను.

**(సి)** ప్రత్యేకమైన అంశప్రార్ధన ఏదైనా ఉంటే ఇప్పుడు ఆ ప్రార్ధన చేయవలెను. జబ్బులు, ఇబ్బందులు, అవమానములు, శ్రమలు, నవీనకాలపు ఆపదలు ఈ మొదలైన వాటిని గురించి ప్రార్ధించవలెను. 'నాకేమి కొదువ,' 'పాపికాశ్రయుడవు' అను కీర్తనలు పాడవలెను.

**స్తుతి ప్రకరణము:–**

**1) అపకార నివారణ స్తుతి:–** అనగా కలిగిన నష్టములు, గండముల నుండి ప్రభువు విమోచించిన సంగతి తలంచుకొని ఆయనను స్తుతించుట. షరా: ఓ ప్రభువా! నా జబ్బునుండి తప్పించినావు గనుక స్తోత్రములు. ఓ ప్రభువా! ఇబ్బంది నుండి తప్పించినావు గనుక స్తోత్రములు. ఈలాగు ఎన్ని గండములు, కష్టములు, వ్యాధులు వచ్చినవో ఒక్కొక్కటి తలంచుకొని, ప్రభువును స్తుతించవలెను.

**2) ఉపకార దాన స్తుతి:–** దేవుడు ఎన్ని మేళ్ళు చేసెనో, నీకు ఏమి దానముగా ఇచ్చెనో, వాటన్నిటిని తలంచి ఒక్కొక్క దానినిగూర్చి స్తుతి చేయవలెను. శరీర దానము, ఆహారదానము, వస్త్రదానము ఈ మొదల గునవి. అవి మాత్రమేగాక కుమారదానము, వాక్యదానము, సంఘదానము ఇట్లు అన్ని తలంచి స్తుతించవలెను.

**దైవలక్షణముల స్తుతి:–** దైవలక్షణముల స్తుతిచేయవలెను.

**1) ప్రేమ:–** తండ్రీ! నీవు ప్రేమవైయున్నావు. నీవు ప్రేమవై యున్నందుకు స్తోత్రములు. నీలోని లక్షణములను మానవులమైన మేము

అనుభవించుటకు, వాటితో మనుష్యులను కలుగజేసియున్నావు. కాబట్టి నీకు స్తోత్రములు. మేము పుట్టకముందే, నిన్ను ప్రేమింపక ముందే, నీవు మమ్మును ప్రేమించినావు స్తోత్రములు. మేము పాపులమై యుందు మనియు, అవిధేయులమై యుందుమనియు నీకు ముందే తెలిసినప్పటికిని నీవు మమ్మును ప్రేమించుచున్నావు. మా మీద నీకున్న ప్రేమను చూపించే టందుకు, నా విషయమై దేవదూతలను పరిచారకులుగాను, భూమిని నివాస స్థలముగాను కలుగజేసినావు గనుక నీకు స్తోత్రములు. మాకు కావలసినవన్నియు ముందే కలుగజేసినావు, స్తోత్రములు. మేము చెడిపోతే రక్షించుటకు, నీ ప్రియకుమారుని పంపించినావు స్తోత్రములు. నీ కుమారుని ఇవ్వడమువల్ల మాకు సమస్తమును ఇచ్చివేసినావు. నీకు స్తోత్రములు. మేము నీ ప్రేమకు ఏమి చెల్లించగలము! **తిరిగి నిన్ను ప్రేమించుటవల్ల నీ ఋణము తీర్చుకొనగలము.** ఓ ప్రేమగల తండ్రీ! ఓ కటాక్షముగల తండ్రీ! నీ ప్రేమ లక్షణములకును, నీ ప్రేమ క్రియలకును, నీ ప్రేమ పిలుపునకును, నీ ప్రేమ సహవాసమునకును, నీవు బైబిలులో వ్రాయించిన ప్రేమగల మాటలకును అనేక స్తోత్రములు. మేము కష్టములలోను, ఇబ్బందులలోను, శోధనలలోను, మాకు వెంటనే సహాయము కలుగకపోవుట చూచి, నీవు ప్రేమలేనివాడవని పొరబాటున అనుకొనే బలహీనులమై యున్నాము. నీ ప్రేమను మేము గ్రహించక పోవుట మా తప్పు అయియున్నది. నీ ప్రేమ యొక్క ఎత్తైనను, వెడల్పైనను గ్రహించలేము. ఇంత గొప్ప ప్రేమతో మమ్మును ఆవరించుకొనుచున్న తండ్రీ! నీకు స్తోత్రములు. ఈ మా స్తోత్రములను నీ ప్రేమ కుమారుడును, మా ప్రభువైన యేసు పరిముఖమున వేడుకొను చున్నాము. ఆమేన్.

**2) సర్వశక్తి:–** సర్వశక్తిగల దేవా! నీవు చేయలేనిది ఏదియులేదు. అందుచేత నిన్ను స్తుతించుచున్నాము. మా విషయమై నీవనుకొన్నది, తుదివరకు నెరవేర్చుకొనే శక్తిగలవాడవై యున్నావు. నీకు స్తోత్రములు.

మేమేమి ప్రార్థింతుమో నెరవేర్చగల తండ్రివి గనుక స్తోత్రములు. మా ఊహకు మించిన నీ సహాయము మాకు దయచేయు తండ్రివి నీకు స్తోత్రములు. పాపమునకు సంబంధించినది నీవు చేయలేవు, కాబట్టి నీవే సర్వశక్తి గలవాడవై యుందువు, స్తోత్రములు, మరియు నేను పాపములో పడకుండా సహాయము చేయు తండ్రివి. నీవు నా విషయములో పనిచేసే సమయములో, నీ సర్వశక్తిని ఉపయోగించువాడవని ఒప్పుకొనే కృప దయచేయుము. నాలోయున్న బలహీనతను చూడక, నీ యందున్న బలమును చూచే కృప దయచేయుము. నీ శక్తి నా బలహీనతను హరింప జేయుననియు, నీ శక్తి బయలుదేరుననియు, తుదకు నీ శక్తివల్లనే మేము రక్షింప బడుదుమనియు నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాము.

**3) సర్వన్యాయము:-** నీయందు జీవించేవారి విషయములో సహాయము చేయుటచే, న్యాయకార్యము జరుపుచున్న నీకు స్తోత్రములు. ఎవరు నిన్ను ప్రార్థింతురో, ఎవరు నీ వాక్యానుసారముగా ప్రవర్తింతురో, ఎవరు నీకు విధేయులై యుందురో, వారికి నీవు ఎల్లప్పుడు ఉపకారము చేయుచు, నిన్ను నీవు బయలు పరచుకొందువు. న్యాయస్తుడవైన దేవా! నేనెరిగిన నీ న్యాయ స్వభావముయొక్క ఉద్యోగము నిమిత్తమై నీకు స్తోత్రములు, 'నా యొద్దకు వచ్చువారిని నేనెంత మాత్రమును త్రోసివేయను' అనే అమూల్య వాగ్దానము తలంచుచు, నిన్ను స్తుతించుచున్నాను. తండ్రీ! న్యాయస్థుడైన దేవుడే నా తండ్రియై యున్నాడు. కాబట్టి మాకు కావలసినవి తప్పకుండా ఇచ్చునను న్యాయమైన విశ్వాసము మాకు దయచేయుము. ఓ దయగల తండ్రీ! నీవు పరిశుద్ధమైన న్యాయము గలవాడవు. గనుక నీ ఆజ్ఞలు మీరే వారిలో నీ బిడ్డలమైన మేము ఉన్నప్పటికిని, వాటివలన కలుగవలసిన కష్టములు వారిమీదికి వచ్చుటచూచి, ఊరుకొనుటనే న్యాయ కార్యము జరిగించుచున్నందులకై నీకు స్తోత్రములు. దయగల తండ్రీ! మాకు కష్టములు రానిచ్చి, ఆ కష్టములలో నీ ఆజ్ఞలు బోధించి, దానిచొప్పున

మేము నడిచేటట్లు చేసి, నడిచినామని మెచ్చుకొని బహుమానమిచ్చే, న్యాయమైన తండ్రివని నిన్ను స్తుతించుచున్నాము.

**4) సర్వాధికారి:–** సర్వాధికారియైన దేవా! నీవు ఏమి సృజించి నావో, దానియంతటి మీదను నీకు పూర్ణాధికారము కలిగి యున్నందున నీకు స్తోత్రములు. నేను నీ అధికారమునకు ఆనందించుచున్నాను, అంగీకరించుచున్నాను. నాకు నీ మీద అధికారమున్నందువల్ల అపవాదికి గాని, అతని సంబంధికులకు గాని, అతని సంబంధమైన వాటికి గాని, నామీద ఏ విధమైన అధికారము లేకుండా చేయుచున్నందుకు నీకు స్తోత్రములు. సర్వాధికారివగు దేవా! అధికారము నీదే కనుక నా ఇష్ట ప్రకారము నేను నడువక, నీ ఇష్టప్రకారము నడిచే భాగ్యము కలిగింతువని నేను ఆనందించుచున్నాను. నీ అధికారమే నాకు లేనియెడల, నా ఇష్టాధికారము చెల్లుబడి కాక ఎన్నో చిక్కులలో పడుదును. అట్టిది ఎన్నడైన జరుగకుండునట్లు, నీ సర్వాధికారమునకు 'చిత్తము ప్రభువా!' అనుచు, నీకు వందనములు ఆచరించుచున్నాను.

**5) దైవస్థితి:–** దేవా! నీవు దేవుడవై యున్నందుకు స్తోత్రములు. నీవు దేవుడవు గనుక అన్ని లోకములకంటే గొప్పవాడవు. అందరికంటే, అన్నిటికంటే నీవు శ్రేష్ఠుడవు, కనుక స్తోత్రములు. తండ్రివైన దేవా! మా దృష్టిలో ఏది గొప్పదై యున్నదో, అది మాకు గొప్పది కాదు. నీవే గొప్ప, నీ కనేక స్తోత్రములు. నీవు ఆ విధముగా బైలుపడినందుకు స్తోత్రములు. దేవాది దేవుండ్లని మనుష్యులనుకొనే దేవుండ్లకంటె గొప్పవాడవైన దేవా! నీ కనేక స్తోత్రములు. మేమేది చూచుచున్నామో, మాకు ఏది కావలెనో, మేమేది ఎరుగుదుమో, మేమేది పొందియున్నామో, మనుష్యులందరు ఏమి ఎరుగుదురో, ఏమి తెలుసుకొందురో, ఏమేమి క్రొత్తక్రొత్తగా కనిపెట్టు చున్నారో వాటి అన్నిటికంటె గొప్ప వస్తువు నీవైయున్నావు కనుక స్తోత్రములు. అన్ని

లేకపోయిన, నీవు ఒక్కడవే యుంటే మాకు అన్నీ ఉన్నట్టే. నీవిచ్చిన అన్నిటిని చూచుచున్నప్పుడెల్ల నీవే మాకు జ్ఞాపకము వస్తావు నీకు స్తోత్ర ములు, ఎందుకంటే, ఆ వస్తువులకంటె ఆ వస్తువులను పుట్టించిన నీవే గొప్పవాడవు గనుక స్తోత్రములు.

దేవా! నీవు మా ప్రభువైయున్నావు. అందరి ప్రభువైయున్నావు. ఏలుబడి నీదై యున్నది, మా మీద నీవు ప్రభువై యున్నావు. గనుక మమ్ములను నీ మార్గములలో, నీ నీతి మార్గములలో నడిపించెదవు. అందుచేత నీకు వందనములు. ప్రభువా! నీవు మా ప్రభుడవు గనుక మేము నీ ప్రజలమై యున్నాము. నీ ఏలుబడిలో క్షేమము, శాంతి, సంతోషము పొందుదుము. ఇశ్రాయేలీయులందరు తమ ద్రాక్షచెట్ల క్రిందను, అంజూరపు చెట్లక్రిందను నిర్భయముగా బ్రతికిరని సొలొమోను రాజ్య నివాసులను గూర్చి చెప్పబడిన మాట వాస్తవమైతే (1రాజులు 5:26, 27), ఓ ప్రభువా! ఓ దివ్య లక్షణములు గల ప్రభువా! ఓ మహా ప్రభువా! నిన్ను గూర్చియు, నీ ఏలుబడి గూర్చియు మరింత వాస్తవమై యున్నది.

**6) పరిశుద్ధత:–** తండ్రివైన దేవా! నీవు పరిశుద్ధుడవై యున్నావు. నీవు ఎంత పరిశుద్ధుడవై యున్నావో, ఎవరునూ గ్రహింప లేరు. ఎన్నడు పాపము ఎరుగనటువంటి పరిశుద్ధులైన దేవదూతలు సహితము; నీ పరిశుద్ధత యెదుట, నీ మహిమకాంతి ఎదుట నుండలేక, చూడలేక, రెండు రెక్కలతో ముఖమును కప్పుకొన్నారని వ్రాయబడి యుండగా, నీ పరిశుద్ధత ఎంత గొప్పదో ఇందులో చూచుచున్నాము. మహా పరిశు ద్ధుడా! అత్యంత పరిశుద్ధుడా! నీకు స్తోత్రములు, ఏమని స్తుతించగలము! మేము ఎంత బాగుగా స్తుతి చేసినను, దానిలో ఏదో ఒకచోట లోప ముండును. మా హృదయములు ఎంత శుద్ధిగాయున్నను, ఎక్కడైనా ఒక చోట అపవిత్రత యుండును. నీ పరిశుద్ధత ఎదుట ఏ పరిశుద్ధత,

పరిశుద్ధతయని అనిపించుకొనగలదు? నీ కాంతి ఎదుట, నీ పరిశుద్ధమైన కాంతి ఎదుట - సూర్యకాంతి, చంద్రకాంతికూడా కాదని నీ వాక్యములో వ్రాయబడి యుండగా, నీ పరిశుద్ధతను గూర్చి ఎట్లు స్తుతించగలము! మహా పరిశుద్ధుడవైన తండ్రీ! నీలో మేము ఏమి లోపములు కనిపెట్టగలము! మా విషయములో నీకున్న ప్రేమ ఎంత పరిశుద్ధమైనదో ఏమి చెప్పగలము! ఏమి వర్ణించగలము! గనుక నీ కనేక స్తోత్రములు. నీవు పరిశుద్ధుడవు గనుక సర్వలోకమును, పరిశుద్ధమైన వాటినిగా కలుగజేసినావు. నీకు స్తోత్రములు. నీవు పరిశుద్ధుడవు గనుక న్యాయము చొప్పున మేము నిన్ను పరిశుద్ధులతో కలిసి స్తుతించవలసినది గాని ఏమి చేయగలము? చేయలేము. చేయగలుగుచున్నదేమో అదే అంగీకరించుమని వేడుకొను చున్నాము. మహా పరిశుద్ధుడవైన దేవా! నీవెంత పరిశుద్ధుడవైనప్పటికిని, అపరిశుద్ధమైన ఈ లోకమునకు నరావతారిగా వచ్చినావు గనుక స్తోత్రములు. అంత మాత్రముచేత నీ పరిశుద్ధతకు లోపము కలుగలేదు. సూర్యరశ్మి అపవిత్ర స్థానములపై ప్రకాశించినను, దాని కళకు కళంకము కలుగదు. నీ పవిత్రత అపవిత్రత దగ్గరకు వచ్చినను ఏ మాత్రమును తగ్గదు. 'ఓ దేవా! నీవు పాపులతోను, సుంకరులతోను కూర్చుని భుజించినను నీవు పరిశుద్ధుడవే. అపరిశుద్ధురాలైన స్త్రీ వచ్చి నిన్ను ముట్టగా, ముట్ట నిచ్చినప్పటికిని నీవు పరిశుద్ధుడవే. మహా పరిశుద్ధుడవైన దేవా! నీవు దేవుడుగా నున్నప్పుడు మాత్రమే గాక! మా శరీరమును ధరించుకొన్నప్పుడు. కూడ నీవు పరిశుద్ధుడవే. నీలో నేరమున్నదని ఎవరు ఋజువు చేయగలరు! నీ క్రియలు పరిశుద్ధ క్రియలై యున్నవి. మహా పరిశుద్ధుడా! నీవు సృజించిన క్రియలు పరిశుద్ధములై యున్నవి. అవి మాత్రమేగాక నీవు మమ్ము రక్షించుటకై, సృష్టిలో భూమిమీద చేసిన క్రియలుకూడ పరిశుద్ధమైనవి. అవి మాత్రమేకాక మమ్ములను రక్షించుటకై నీవు నడచిన క్రియలుకూడ పరిశుద్ధమైనవి. అవి మాత్రమేగాక నీవు

చేసిన బోధలు పరిశుద్ధములైనవి. అవి మాత్రమేగాక నీవు పొందిన శ్రమలు పరిశుద్ధమైన రీతిగా అనుభ వించిన శ్రమలైయున్నవి. వీటన్నిటినిబట్టి నీవు పరిశుద్ధుడవని బయలు పర్చుచున్నావు గనుక స్తోత్రములు. ఓ పరిశుద్ధుడవైన యేసుక్రీస్తు ప్రభువా! లోకరక్షకులని మానవులు చెప్పుకొనే రక్షకులందరి కంటే నీవే మొదటివాడవు, నీవే పరిశుద్ధుడవు, నీవే రక్షకుడవు గనుక స్తోత్రములు. ఓ పరిశుద్ధుడవైన రక్షకా! నీవు పాపములేని వాడవును, పరిశుద్ధుడవైనందువల్ల అందరిని రక్షించగలవు. నిన్నును రక్షించుకొనగలవు గనుక స్తోత్రములు. మహా పరిశుద్ధుడవైన నీవు రెండవ మారు వచ్చునప్పుడు, నీ కాంతిని చూచి మేమెంతగా ఆనందింతుమో, ఆశ్చర్యపడుదుమో నీకు స్తోత్రములు.

పరిశుద్ధుడవైన పరిశుద్ధుడా! దైవాత్మవైన పరిశుద్ధుడా! జీవాత్మవైన పరిశుద్ధుడా! మోక్ష పావురమైన పరిశుద్ధుడా! ఓ పరిశుద్ధమైన దేవా! నీవు కేవలము పరిశుద్ధుడవైనందుకు స్తోత్రము. నీ పరిశుద్ధతనుగూర్చి నీవు మాకు ఎంత బయలుపర్చినావో, అంత మాకు తెలుసుగాని ఎక్కువ తెలియదు. తెలిసినదంతయు మహా పరిశుద్ధమైనది గనుక నీకు స్తోత్రము. అగ్ని నాలుకలుగా ప్రత్యక్షమగు దేవా! అగ్ని నాలుకలు పరిశుద్ధమైనవై యుండగా, నీ వెంత కాంతిగలవాడవో మేమేమి చెప్పగలము! నిత్యము ప్రకాశించే ఆత్మవైన ఓ దేవా! నీవు మా హృదయములోనికి వచ్చుటకు, ఎంతమాత్రము సందేహించవు. నీవు పరిశుద్ధుడవని చెప్పి, పాపులమైన మాలో నివసించుటకు అసహ్యించుకొనవు. నీది ఎంత గొప్ప పరిశుద్ధత నీది ఎంత అరమరలేకుండా యుండే పరిశుద్ధత! పరిశుద్ధుడా! నీకు పరిశుద్ధమైన వందనములు. తండ్రియొద్ద నుండి, కుమారుని యొద్దనుండి వచ్చిన ఓ పరిశుద్ధాత్మ దేవా! ఇదివరకున్న నా హృదయమనే వస్తువును నేటికి కొంత మెరుగైన వస్తువుగా మార్చిన ఓ దేవా! ఇకమీదట ఈ వస్తువునకెంత మెరుగు పెట్టుదువో ఎవరు ఎరుగగలరు! మేము మహిమ లోనికి వచ్చిన తరువాత, మమ్మును ఎంత చక్కని వస్తువుగా

మార్చెదవో మేము గ్రహింపలేము. నీవల్ల మార్చబడిన హృదయములే పరిశుద్ధములై యుంటే, నీవెంత పరిశుద్ధుడవో ఎవ్వరెరుగుదురు? ఓ పరిశుద్ధ దేవా! నీ కార్యములు పరిశుద్ధమైనవి! నీ మార్పు అద్భుతము! నీ వెలిగింపు నూతనమైన సృష్టియై యున్నది! పరిశుద్ధుడా! నీకు పరిశుద్ధమైన స్తోత్రములు. ఓ పరిశుద్ధాత్మ దేవా! సృష్టికాలమందే సృష్టి అంతటిమీద రెక్కలు చాచి కాపాడుచున్న ఓ దైవాత్మా! కడవరి రోజులలో 'ప్రభువైన యేసూ రమ్ము!' అని సంఘములు చేయు ప్రార్ధనకు సహాయము చేయుచున్న తండ్రీ! నీకు స్తోత్రములు. ప్రకటన 22:20.

**7) సర్వవ్యాపకత్వము:-** ఓ దేవా! నీవు సర్వవ్యాప్తివై యున్నావు గనుక స్తోత్రములు. నీవే సర్వమును సృజించియున్నావు, సృజించుచున్నావు గనుక సమస్తముండే చోట నీవున్నావు. నీవు కలుగజేసిన వాటిలో దేనికైనను నీవు వేరుగాను, దూరముగాను యుండవని మేమెరుగుదుము. నీవు పరలోకమందును, భూలోకమందును, అన్ని స్థలములలోను ఉండగలవాడవు గనుక స్తోత్రములు. నేను ఎక్కడ ఉన్నను నీవు అక్కడ ఉండగలవాడవు. నీవు నాకు జతగా ఉండగలవు. ఉండి నాకు సహాయము చేయగలవు. నేను ఒంటరిగా ఉన్నాను, అను చింత లేకుండా చేయగలవు. గనుక నీకు వందనములు. అన్ని స్థలములలో నీకు వందనములు. నీవు లేని స్థలము లేదు. నీవు లేకుండా ఏదియు లేదు గనుక స్తోత్రములు. రెప్పపాటులో ఎక్కడబడితే అక్కడకు, ఎప్పుడు బడితే అప్పుడే వెళ్ళగలవు. దేవుడు సర్వవ్యాపి, ఈ గొప్ప అంతస్తు మాకు ఇవ్వలేదనుకొన్నాము. ఆ మట్టిమీద ఉన్నప్పుడు తెలిసికోలేదు. ఇప్పుడు తెలిసిపోయినది. అంతగొప్ప అంతస్తు మాకును అనుగ్రహించినందులకు వందనములు.

**8) జీవము:-** జీవమైయున్న దేవా! నాలోని జీవము, నా బలహీనతను బట్టి నిర్జీవ స్థితిలోనికి వచ్చునప్పుడు, మరల నాలో నూతన జీవము ధారపోయుదువు గనుక నీకు నిత్యజీవ స్తోత్రములు.

**9) జ్ఞానము:–** జ్ఞానమైయున్న దేవా! నీవు జ్ఞానివి గనుక నా కష్టములు, నా కోరికలు నీకు చెప్పుకొనకముందే నీకు తెలిసియున్నవి. అందుచేత నీవు నా కోర్కెలు తీర్చగలవు. నా కోర్కెలు నెరవేర్చుటకు ఎన్నో చిక్కులు అడ్డముగానున్నను, ఆ చిక్కులన్నియు విడదీసి, నా కోర్కెలు నెరవేర్చగల జ్ఞానోపాయము నీకు గలదు గనుక నీకు నాకు తెలిసినన్ని వందనములు. నా జ్ఞానమునకు తోచినన్ని వందనములు చేయుచున్నాను.

**10) నిరాకారము:–** నిరాకారుడవైన దేవా! నా బలహీనతనుబట్టి నేను నిన్ను చూడలేకపోయినను, నీవు నన్ను చూచుచున్నావు. నీవు నిరాకారుడవు, అయినప్పటికిని నాకు ఉపయోగకరమైన శరీరాకారమును దయచేసినావు. మరియు నా ఆత్మకు నిరాకారము అనుగ్రహించినావు కాబట్టి నా శరీరముతోను. నా ఆత్మతోను నిన్ను స్తుతించుచున్నాను.

**11) స్వతంత్రత:–** స్వతంత్రుడవైయున్నతండ్రీ! సమస్త కార్యములు నీయంతట నీవు చేయగల తండ్రీ! నీకు స్తోత్రములు. నేను కూడా స్వతంత్రముగా పనిచేయగల శక్తి అనుగ్రహింపగలవు. నీ మీద మాత్రమే ఆధారపడి, నాలోని స్వతంత్రతను బట్టి నా కార్యములు చేసికొనగల స్థితి అనుగ్రహించినావు గనుక నీకు స్తోత్రములు. స్వేచ్ఛా పూర్వకమైన స్తోత్రములు. బలవంతముగా కాక కేవలము స్వతంత్రముగా నిన్ను స్తుతింపగోరుచున్నాను. నీ గుణములన్నియు నాకు కూడ అనుగ్రహించుట వలన నీ లక్షణ రూపము, నీ కోరిక నాకు అనుగ్రహించినావు. అన్నియు అను గ్రహించి, ఒక్క స్వతంత్ర లక్షణముగాని అనుగ్రహింపకున్న యెడల, తక్కినవన్ని ఇచ్చినా ప్రయోజనము లేదు. గనుక స్వతంత్ర లక్షణము ఇచ్చినందుకు నీకు స్తోత్రములు.

**12) త్రిత్వము:–** తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలను పేరులతో బైలుపడిన త్రియేక దేవుడవైన తండ్రీ! నీ ప్రత్యక్షత విషయమై నీకనేక

వందనములు. నీవు నాకు దాగియుండు దేవుడవు కావు గాని బైలుపడు దేవుడవు. నీ లక్షణములు, నీ క్రియలు, నీ గొప్పతనము, నాకు బైలుపర్చు దేవుడవు గనుక నీకు వందనములు. నీవు ఒక్కడవుగాను, ముగ్గురుగాను బైలుపడినావు. నీ మర్మము నాకు తెలియదు గాని నమ్ముచున్నాను. నేను నీయొద్దకు పరలోకమునకు జేరినప్పుడు, ఆ నీ స్థితిని తెలిసికొన గలను. నీ అపరిమిత జ్ఞానస్థితిని, నా పరిమిత జ్ఞానస్థితితో ఎట్లు తెలిసికొనగలను. అనంతకాలము నీ విషయములు, క్రొత్త క్రొత్తగా తెలిసికొనుచునే యుందును. **నీ ప్రత్యక్షతకును, నేను తెలిసి కొనుటకును అంతములేదు.** గనుక నీకు అంతములేని స్తుతులు చెల్లించుచున్నాను.

**13.** మహిమ స్వరూపీ! ఆనంద స్వరూపీ, నేను నిత్యము నీ మహిమ కొరకు నీ ముఖ దర్శనములో, నీ సన్నిధిలో, నీ సహవాసములో మిగుల ఆనందముగా గడుపగల స్థితి నాకు దయచేయుదువని నమ్ముచు, నీకనేక వందనములు చేయుచున్నాను.

**షరా:–** ఇట్లు అన్ని గుణములను వర్ణించుచు స్తుతించవలెను. దావీదు కీర్తనలు 136, 150; రోమా 8వ అధ్యాయములను చదువవలెను. స్తోత్రము చేయుపాట స్తుతిగాను, ప్రతి అంశము చివర 'యెహోవా నా మొరలాలించెను' అను పాటయు పాడవలెను.

**షరా:** ఉదయము 6గం॥ల నుండి 12 గం॥ల వరకు ఈ ప్రార్థనలు ముగించవలెను.

# కనిపెట్టు ప్రకరణము

రెండవపూట అంతయును కనిపెట్టుటలోనే జరుపవలెను. ప్రార్థనాది కార్యములు జరుపకూడదు. **ప్రభుక్రీస్తు ముఖబింబము చూస్తూ**

**ఉండవలెను.** అప్పుడే ఆయన కిరణములు మనలో ప్రవేశించును. దర్శనము రాకపోయినను పర్వాలేదు, మనస్సులో సంతోషముండును. అదే జవాబు.

షరా: సంఘమంతయు ఉపవాసముండవలసిన రోజున, ఇటువంటి కార్యక్రమమును నాయకులు ఏర్పాటుచేసి జరిగించవచ్చును. ముగింపు 6 గం॥లకు, అప్పుడు 'మనసానందము బొందుట కన్నను' అను కీర్తన పాడి ఇంటికి వెళ్ళవచ్చును. ఒక్కొక్కప్పుడు ఈ మన ప్రోగ్రాము జరుగనియ్యక, ఆత్మ తండ్రి క్రొత్త ప్రోగ్రాము ఇస్తే అది చేయవలెను. అయితే, వ్రాతలోనున్న ఈ ప్రోగ్రామునకు తిరుగులేదు.

ఉపవాస కూటమునకు పిశాచికూడ హాజరగును. మనలోనున్న ఏదో లోపము ద్వారా ప్రవేశించి, కూటమును చెడగొట్టును గనుక మెళకువగా నుండుడి. ఈ ప్రకరణము ప్రకారముచేసి, పరలోకమునుండి ఎవరిని పంపమంటే వారిని ప్రభువు పంపును, అప్పుడు వారువచ్చి మాట్లాడుదురు. కనిపెట్టు సమయములో స్వరము వినబడును, దర్శనము కూడ కనబడును. ఒకవేళ కనబడకపోయినను పైన చెప్పిన రీతిగా నుండును. ఈ గదిలో ప్రభువుమీద నీ ఇష్టము వచ్చిన ప్రశ్నలు వేయవచ్చును. ఆయన నీకు జవాబిచ్చును. ఒక భక్తురాలు ఎంత ప్రార్థించినను, 'దర్శనములోనైనను ప్రభువు కనబడలేదు' అని ఆమె అనగా, **'అంతా నీదే'** అని ప్రభువు చెప్పెను. ఆ మాట విని ఆమె ఎంతో ఏడ్చెను. అద్భుతములు, మహా అద్భుతములు, మహా మహా అద్భుతములు చేయగలరు. అక్కడే ఉంటారు. ప్రపంచమంతా త్రిప్పగలరు. అనుమానము ఒక దయ్యము, చింత ఒక దయ్యము, భయము ఒక దయ్యము గనుక వీటిని లోపలకు రానీయవద్దు. ఏవి విడిచిపెట్టినావో, ఏవి చేయవలెనో నీకు తెలుసును గనుక నెరవేర్చుము. ప్రతి అంశము దగ్గర మహా గొప్ప వినయము చూపవలెను. ప్రతి అంశము ముగించిన పిదప, మహా గొప్ప

సంతోషముండవలెను. ఈ బోధ అంతా మా కందరకు ఉపయోగకరముగా నుండునట్లు చేయుము. ఆమేన్.

# మరికొన్ని ప్రార్థనలు

**వాక్యము విప్పు ప్రార్థన:–** త్రియేక దేవుడవైన తండ్రీ! ఆకాశము తెరువబడుట, దైవాత్మ పావురమువలె కనబడుట నీవు చూచితివని చదువుకొన్నాము. ఆకాశము తెరువబడుట అనునది క్రొత్తమాట, ఎందుకంటే, ఆకాశము ఎప్పుడూ తెరవబడేయున్నది. వర్షాకాలములో, అప్పుడప్పుడు వర్షాలు కురిసేటపుడు, ఆకాశమంతా మబ్బుతో మేఘములు క్రమ్మి, చీకటిగానుండి, గాలివల్ల ఆ మేఘములు విడిపోవును. ఈలాగు నీలాకాశము తెరువబడుట మాకు తెలియును. అయితే ఆకాశము తెరువబడెనను మాట వేరేమాట. ఈ మాటను బట్టి ఆ మాట; ఆ మాటనుబట్టి ఈ మాట గ్రహించగలము.

అలాగే నీ గ్రంథమును మా చేతులతో స్వయముగా విప్పగలము. నీవు వచ్చి విప్పనక్కర లేదు. మేము కాగితము తర్వాత కాగితము, పుట తర్వాత పుట విప్పుకొనగలము. అట్లే దానిలోని చరిత్రకూడ విప్పి చూడగలము. గాని ప్రభువా! నీ వాక్యములోనున్న అసలైన అర్థము మేము విప్పి చూడలేము.

మాకున్న జ్ఞానాన్నిబట్టి కొంత విప్పి చూడగలమే గాని, దానిలో నీవు పెట్టిన ఉద్దేశ్యమును గ్రహింపగల అర్థమును మేము విప్పి చూడలేము. నీవే వచ్చి చూపించాలి. ఓ తండ్రీ! నీ ఆత్మ సహాయమువల్ల మా జీవిత కాలమంతయు, ఎప్పటికప్పుడే బైబిలు గ్రంథము విప్పి చూపించుము. అప్పుడాకాశము తెరువబడుట అనేది గ్రహింపగలము. మేఘాకాశము కాదు, పరలోక ఆకాశము మాకు తెరువబడును. బైబిలులోనున్న అర్థము

తెరువబడినప్పుడే, పరలోక ఆకాశము తెరువబడును. అప్పుడు మేము భూమిమీదనుండి పరలోక ఆనందమును అనుభవింపగలము. అట్టి కృప మాకు దయచేయుమని వేడుకొంటున్నాము.

ఈ కూటములోనున్న ఒక్కొక్కరికి, బైబిలు గ్రంథమును నీవే తెరచి చూపించి, ఈ విధముగా పరలోకమును తెరచి చూపించుము. మాలో ఎవరిని తప్పిపోకుండా కాపాడుము. మేము లోకములోనున్న అందరిని గురించి, ఈ వేళ ప్రార్థించగోరుచున్నాము. మాకు ప్రార్థన వాలు దయచేయుము. పరలోకపు తండ్రీ! ఈ ప్రారంభ ప్రార్థన త్వరగా వస్తున్న యేసు ప్రభువుద్వారా ఆలకింపుము.

తండ్రీ! నీవు గ్రుడ్డివారి యొక్క శరీర నేత్రములు తెరుస్తున్నావు. అందుచేత వారు బాగుగా చూడగలరు. నీవు మాకిచ్చిన ఈ బైబిలు గ్రంథము 66 పుస్తకములు గల పెద్ద పుస్తకము. అది చదువుకొనేటందుకు మాకిచ్చినావు స్తోత్రములు. మా శరీర నేత్రములు విప్పుము, ప్రభువా! మరియొక సంగతి: దానిలోని చరిత్ర మేము చూచేటందుకు మా సహజ జ్ఞాననేత్రమును తెరువుము తండ్రీ! మరియొక మనవి. నీ వాక్య చరిత్రయొక్క అంతర్భాగమందున్న అర్థమును చూచేటందుకు, మా అంతరంగ నేత్రములను తెరువుము. అప్పుడు మేము నిన్నుబట్టి, నీ వాక్యమును బట్టి ఆనందింపగలము.

పరలోకపు తండ్రీ! నీవు మా ఎదుట బైబిలు తెరచి చూపిస్తున్నట్లు లోకము ఎదుట కూడ పెట్టి తెరచి, లోక నేత్రమునకు చూపింపుము. లోకనేత్రము బైబిలును చూచుచున్నది గాని లోపలి అర్థము చూడలేక పోవుచున్నది. ఆ లోకమును గురించి మేము ప్రార్థించుచున్నాము. అది మాత్రమే కాకుండా లోకము మధ్యను ఉన్న క్రైస్తవ సంఘములో నున్న కొందరియొక్క ఆత్మ నేత్రములు తెరువబడనందువల్ల, వారికి కూడ

పువ్వారము కనబడుటలేదు. గనుక వారి నిమిత్తము కూడ లోకముతోపాటు ప్రార్థించుచున్నాము. నీవు మాకు ఈ ప్రార్థన ఎందుకు పెట్టినావో, ఆ ఉద్దేశ్యము నెరవేరేటందుకు త్వరగా వస్తున్న ప్రభువుద్వారా ఆలకించుము. ఆమెన్.

బైబిలులోని పై పని అందరకు తెలుస్తుందిగాని లోపలి పువ్వారము, మకరందము, పూతేనె, పూర్ణము అందరకు తెలియదు. అసలైన నిఖార్సైన సరుకు, మనకందరకును కావలసినది అదే. దేవా! నీ కడుపులో ఏముందో అది మాకు చెప్పుము.

కీర్తన: 'ముందు నా మనస్సు దేవుని కప్పగింతు'.

పరలోక ఆకాశము తెరువబడినప్పుడు, పొందబోయే ముక్తి ఈ భూమి మీదనే చూస్తాము. వర్షాకాలంలో తప్ప ఈ మేఘాకాశము ఎప్పుడు తెరువబడే ఉండును. అప్పుడయినా గాలి రాగానే తెరువబడును. త్వరలో పరలోక ఆకాశము తెరువబడును. అది దైవజ్ఞులకేగాని లౌకికులకు కాదు. 'యేసూ నీ తలపే నాకు' అను కీర్తన పాడవలెను.

మేఘాలెన్ని? 1) పరలోక సంగతులు అర్థముకాకుండా చేసే అజ్ఞాన మేఘము. 2) సూర్యకాంతి కనబడకుండా చేసే వర్షించే మేఘము. 3) దేవుని ప్రేమను చూడకుండా చేసే కష్టకాల మేఘము. కష్టకాలము మనిషిని కప్పివేయును. ప్రభువు ఆ కష్టకాలము విప్పితే, దేవుని ప్రేమను చూడగలము, ఒక బోధకుడు, 'అమ్మా! నీ కష్టకాలములో దేవునిని దూషించుచున్నావు, గనుక దూషించుట మాని భూషించుము. పరలోక బహుమానము రావడానికే ప్రభువు నీకు కష్టకాలము రానిచ్చినాడు' అని చెప్పినాడు. సహించడానికి, ఆమె ఏమి అనలేదు గాని చిరునవ్వు నవ్వి ఇక దూషించను. అప్పుడు కష్టాల మేఘము విడిపోయెను. **ఈ మూడు**

**మేఘాలు ఆయనే విప్పాలి. అందుకొరకే ప్రార్థన చేయాలి, మోకాళ్ళూని ప్రార్థన చేయాలి.** మొదటి కష్టము మోకాళ్ళూనుట లేక మోకాళ్ళమీద కూర్చుండుట లేక సాష్టాంగపడుట. గనుక ఆయన అపరంజి పాదముల మీద సాగిలపడండి. ఒక ప్రవక్త మోకాళ్ళలో తలపెట్టుకొని ప్రార్థించెను.

దయగల తండ్రీ! నేటి ప్రార్థన వినుటకు ఎంతో సంతోషిస్తున్న తండ్రీ! నీకు స్తోత్రములు. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను అని వ్రాయబడి యున్నది. అందుచేత మేము లోకమును గురించి ప్రార్థిస్తే, నీవు ఎంతో సంతోషిస్తావు. తండ్రీ! లోకములో కొన్ని మతములు ఏర్పడినవి గాని ఒక మతము, మరొక మతమునకు విరుద్ధముగా బోధిస్తుంది. అలాగైతే ఏది నిజమో మేమేలాగు తెలిసికొనగలము!

ఒక మతములోని బోధకుని అడిగితే ఒక విధముగా చెప్పును. ఇంకొక మతములోని బోధకుని ఆ సంగతే అడిగితే, ఇంకొక విధముగా చెప్పును. మేము మా జ్ఞానమును, మా మనస్సాక్షిని అడిగితే ఇంకొక రీతిగా చెప్పును. వీటి మధ్యను ఇరుకునపడి, ఏది నిజమో తెలియక గందరగోళ పడుచున్నాము. కనుక నీవు వచ్చి ఏది నిజమో చెప్పి, సంగతులు పరిష్కరింపవలెనని కోరుచున్నాము. అందుకే గదా, మేము రెండు ప్రార్థనలు కల్పించుకొన్నాము. 'దేవా!' మాకు కనబడుము, మాతో మాట్లాడుము' అని ప్రార్థించుచున్నాము. ఆ ప్రార్థనే ఇప్పటికిని చేస్తున్నాము. అన్ని మతముల యొద్దకు వెళ్ళి, క్రైస్తవ బోధకులు క్రీస్తే రక్షకుడనియు, క్రైస్తవ మతమే దేవుడు స్థాపించిన మతమనియు, బైబిలు గ్రంథమే దేవుడు పంపిన పుస్తకమనియు చెప్పుచున్నారు.

అయితే తండ్రీ! ఇతర మతస్తులు వీటిని నమ్మలేరు. మాకు మతమున్నది, మాకు కూడా గ్రంథాలున్నవి. మాకు రక్షకులున్నారని అనుచున్నారు. వారు అనడమేకాక వారి నమ్మకము కూడ అదే. కాబట్టి

ప్రతి మతము, వారికి చెప్పవలసినది చెప్పుము. క్రైస్తవులు చెప్పవలసినది చెప్పివేసిరి. ఇతర మతములవారు, తమ అభిప్రాయములను తెలియపర్చిరి. సంఘకాలముయొక్క కడవరికాలము వచ్చియున్నది.

యేసుప్రభువా! విశ్వాసులయొక్క సంఘమును మహిమ మేఘములోనికి ఆకర్షించుకొని, మోక్షలోకమునకు ప్రాణముతోనే తీసికొని వెళ్ళుటకు, నీవు రావలసిన కాలము మా కాలమే. కాబట్టి విషయములు పరిష్కరించుటకు, నీవు ఇప్పుడు రాకపోతే ఇంకెప్పుడు వస్తావు ప్రభువా! నీకు వందనములు. ఆమేన్.

షరా:- ఈ ప్రార్థనలు ఉదయము 6 గంటలకు మొదలుకొని, అన్నపానాదులు లేకుండా చేస్తే, రాత్రి 10 గంటలగును. అది దీర్ఘ ప్రార్థన, కష్టమైన ప్రార్థన.

# విమోచన ప్రార్థన కూటము

1) ఓ ప్రభువా! మా శరీరములో ఫలాని కష్టములున్నవి. వాటిని తొలగించి, మమ్ము విమోచింపుము. 2) ఓ ప్రభువా! మా ఆత్మీయ జీవితమునకు ఫలాన, ఫలాన ఆటంకములు, ఆపదలు ఉన్నవి. వాటన్నిటిని తొలగించుము, విమోచింపుము. తరువాత కుటుంబము, బంధువులు, స్వజనుల గురించి, పారిష్ను గురించి ప్రార్థించవలెను. 3) ఈ ప్రార్థనలు మోకాళ్ళమీద నుండి చేయవలెను లేక నిలువబడి చేయవలెను గాని కూర్చుండి చేయకూడదు. 4) మోకాళ్ళూని గాని, నిలువబడిగాని, ప్రార్థన చేయలేనివారు ఇక్కడకు రాకూడదు. 5) పిల్లలను తీసికొని రాకూడదు. 6) ధగ్గు, జబ్బు ఉన్నవారు రాకూడదు. 7) పది గంటలవరకు కీర్తనలు పాడకూడదు. 8) శరీరాత్మ జీవనములో 'కావలెనని అడుగవద్దు' గాని 'పోవలెనని' అడుగవలెను. 9) చెడ్డపనులు, అవిశ్వాసము, నిరాశలు,

దిగులు ఇవి ఆత్మీయ జీవనములోనివి. 10) స్వజనులు, సంఘములు, అందరిని గురించి ప్రార్థింపవలెను.

**ప్రార్థన:–** ప్రభువా! నీ సంఘము మోకాళ్ళమీద ఉంటే సైతానుకు గుండె కొట్టుకొనునని ఒక భక్తుడు అన్నట్లు, ఇప్పుడు మేము మోకాళ్ళూనే కృప దయచేసినావు స్తోత్రములు. సమస్త కీడును జయించుటకు ప్రార్థనయే ఆధారము. గాన నీ సంఘమును మోకాళ్లమీద నుంచుము.

1) మీ సొంత ఇంటిలోనివారిని ఒక్కొక్కరిని గురించి ప్రార్థించండి ('మనో విచారము' 45వ వచనము), 2) బంధువులను గురించి, 3) అన్ని రకములైన అధికారులను గురించియు, అనగా లోకములోని అధి కారులను గురించియు, 4) పాఠశాల, వైద్యశాల, గ్రామము, కోర్టు, గవర్నర్లు అన్ని రకములైన అధికారులు; ఎందుకనగా వారి అధికారములు, దేవుని వలన ఇవ్వబడినవి. వారు, ఏ మతము వారైనను, ఏ రకమువారైనను, ఎట్టివారైనను సరే వారి గురించి ప్రార్థించవలెను.

అధికారులు దేవుని యెరిగినవారైతే, బాగుగా పరిశీలింపగలరు గాన అట్టి ధన్యత కొరకు ప్రార్థన చేయవలెను. దేవుని గురించి వారికి తెలియకపోయిననూ, సహజమైన మంచి వారిలో నున్నట్లయిన, దానిని బట్టియైన వారు బాగుగా పరిశీలన చేయుదురు గాన అట్టి మంచిని వినియోగించవలెను. ఒకవేళ వారికి, దేవుని తలంపులేక పోయిన, సహజమైన మంచి లేకపోయిననూ, ఉద్యోగమునుబట్టి ధర్మములు, సూత్రములు, చట్టములు, చరిత్రలు చదివి, పెద్దలు చెప్పు సలహాలనుబట్టి పరిపాలన చేసి, ప్రజలకు ఉపకారము చేయునట్లు, అట్టి స్థితికొరకు ప్రార్థన చేయవలెను.

4) అన్ని వృత్తులవారిని దీవించుము, అప్పుడు పని జరుగును. సేవ జరుగును. వైద్య వృత్తి, చెప్పులు కుట్టుట, నేత మొదలైనవి. మన బోధ వింటే, ఉన్న ప్రజలలో నెమ్మదియుండును.

5) పరిశుద్ధాత్మ తండ్రి వేదనతో ప్రార్ధనచేయుట అయ్యగారు చూచిరి, ప్రార్ధించిరి. వెంటనే పని జరిగినది. జీవమ్మయొక్క వేదన ప్రార్ధనవల్ల ట్రైన్ (రైలుబండి) ఆగిపోయెను. అలాగే మనము వేదనతో ప్రార్ధిస్తే అమెరికా, రష్యా బాంబులు ఆగిపోవును. గాని వేదన ప్రార్ధన రాదు, అనగా తప్పించుకుంటే రాదు. ప్రభువా! క్రీస్తు మతమును వెళ్ళగొట్ట ప్రయత్నించు వారిని క్షమించుము, ప్రభువా! 'వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు. గనుక వీరిని క్షమించుము.'

ప్రభువా! ఆ ప్రయత్నమువల్ల ఏ కీడు కలుగకుండునట్లు కాపాడుము. శత్రువులు ప్రయత్నించే, దుష్ట ప్రయత్నములు నాశనము చేయుము. యేసుక్రీస్తు ప్రభువా! జీవమ్మయొక్క వేదన ప్రార్ధన ఆలకించి, శీఘ్రముగా పరుగెత్తుచున్న రైలుబండిని ఆగకూడని స్టేషనులో ఆపినావు గదా! **అట్లే పేలనైయున్న వారి బాంబులను ఆపుచేయుమని వేడుకొను చున్నాము.** మరియు మా వేదన ప్రార్ధనలను బట్టి, మా ప్రార్ధనలే ఆ బాంబులను ప్రేలకుండాచేసి, వాటికంటే గొప్ప బాంబులవలె ఉండునట్లు దీవించుము, సహాయము చేయుము. 'తుపాకి బాంబు... తుక్కుతుక్కు, తుక్కు'. లోకములోనున్న క్రైస్తవులందరు ఒక గుంపు. వారిచుట్టూ అన్యజను లున్నారు. ఆ బాంబుగాని ప్రేలవలసినట్టైతే, క్రైస్తవులలో ఆ ఎవరు రెండవ రాకడకు వెళ్లవలెనో వారు వెళ్ళుదురు. మిగతా వారు ఉ ండిపోవుదురు. అప్పుడు రెండవ రాకడ అనే బాంబు పేలును. పై చరణము రాకడ విశ్వాసులకు మాత్రమే. ప్రభువు రాతివేత దూరము వెళ్ళి వేదనతో ప్రార్ధించెను, ఏలీయాకూడ ప్రార్ధించెను. మీకు వేదన ప్రార్ధన రాకపోతే, రాకడకు వెళ్ళలేరు.

**విమోచన ప్రార్ధన:-** త్రియేక దేవుడవైన తండ్రీ! సర్వశక్తిగల తండ్రీ! ఎన్ని కోట్లమంది, ఎన్ని మనవులు చేసినను, నీవు సుళువుగా నెరవేర్చగలవు. గనుక నీకు స్తోత్రములు. ఈ కూటములో ఎన్నో కోట్లమంది

లేరు, ఎన్నో కోట్ల మనవులు లేవు. కొద్దిమంది, కొన్ని ప్రార్ధనలు ఉన్నవి. ఇవి నెరవేర్చలేవా! నెరవేర్చెదవని నమ్మితే నెరవేర్చగలవు. కొంతమంది యొక్క హృదయములో వారిని విడిచిపెట్టని పాపములు గలవు, వారు ప్రార్ధిస్తున్నారు. నేడు నీవు వాటిని వదిలించగలవు నీకు స్తోత్రములు. ఆత్మ స్థితి ఈలాగుండగా, కొందరికి శరీరములో అనారోగ్యము గలదు. అది వారిని వదలిపెట్టకుండా నున్నది. అయితే నీవు వదలింపగలవు. నీకు స్తోత్రములు. కొందరికి కొన్ని విషయములలో కొదువలు గలవు. అవి వారిని వదలకుండా నున్నవి. కాని నీవు వదలింపగలవు గనుక నీకు స్తోత్రములు. ఇక్కడున్న వారిలో కొందరికి సంతానము లేదనే విచారమున్నది. అది వారిని వదలకుండా నున్నది. నీవు వదిలించగలవు. నీకు స్తోత్రములు. మరికొందరిని, కొన్ని విషయములలో దురాత్మ పీడించుచున్నది. నీవు వదిలింపగలవు నీకు స్తోత్రములు. కొందరిలో రకరకములైన చిక్కులున్నవి. అవి వారిని వదలిపెట్టడములేదు. నీవు వదిలింపగలవు. కాబట్టి నీకు స్తోత్రములు. కొందరిలో తమ స్వజనులయొక్క కష్టముల నివారణ కొరకైన ప్రార్ధనలున్నవి. నెరవేరనివి కూడ ఉన్నవి. అవి వారిని వేదించుచున్నవి, వారిని వదలడము లేదు. కానీ నీవు వదిలింపగలవు. నీకు స్తోత్రములు. కొందరిలో రక్షణను గురించియు, పెండ్లికుమార్తె వరుసను గురించియు, రాకడను గురించియు అప్పుడప్పుడు సందేహములు వచ్చి, ముందుకుసాగి వెళ్ళుచున్న వారిని, వెనుకకు లాగుచున్నవి. **ఆ లాగడమును వారు తప్పించుకొనలేక పోవుచున్నారు. నీవు తప్పించగలవు గనుక స్తోత్రములు.**

ఇప్పుడు ఉదహరించినవి కాక, ఇతర కష్టములు కలవారుకూడ గలరు. తృప్తిలేనివారు, సమాధానము లేనివారు, శాంతి లేనివారు, నెమ్మది లేనివారు, ఏమి చేయవలెనో తోచనివారు, ఎంత చెప్పినను నచ్చనివారు మొదలగు వారిని గురించి కూడ ప్రార్థించుచున్నాము. వారిలో నున్నవి

విదిల్చివేసి, వారికి శాంతి కలుగజేయగలవు. నీకు స్తోత్రములు. ఎవరైతే స్వస్థానమునకు వెళ్ళవలసి ఉన్నారో, వారికి నీ దూతయొక్క సహాయమును అనుగ్రహించి సురక్షితముగా తీసికొని వెళ్ళుదువని నమ్ముచున్నాము నీకు స్తోత్రములు. ఇక్కడ నేర్చుకొన్న విషయములు, ఇతరులకు కూడ చెప్పించి, సంతోషింపజేయుమని త్వరగా రానున్న ప్రభువు ద్వారా ఈ ప్రార్థనలు ఆలకించుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

**ప్రార్థన:-** ఓ దయగల తండ్రీ! నీవు 'అంజూరపు చెట్టుక్రింద నిన్నుగూర్చి నాకు తెలియును' అన్నట్లు, మమ్ములను గురించికూడ నీకు తెలియును. గనుక మా ప్రార్థన నెరవేరకముందే నీకు స్తుతులు చెల్లించుచున్నాము. ఈ గొప్ప విశ్వాసము, ఈ గొప్ప సహవాసము మాకు అను గ్రహింపుము. **నిన్ను కలిగిఉండే భాగ్యమే భాగ్యము.** నిన్ను కలిగియుండే స్థితే స్థితి. మేము పరలోకమునకు రాకముందే, ఇక్కడ ఈ స్థితి కలిగియుండే భాగ్యము అనుగ్రహింపుము. నీవు నాకుండగా లోకములోనిది ఏదియు నా కక్కరలేదని' బైబిలులో వ్రాయించి పెట్టినావు. ఎంత ఆశ్చర్యకరమైన అనుభవము! మేము కూడ అదే అనవలెను. నీవు మాకుండగా లోకములో ఏది మాకు లేకపోయినా, ఉన్నట్టేనని బైబిలులో వ్రాయవలసినదిగాని, పౌలు అక్కరలేదన్నాడు. ఎంత గొప్ప విశ్వాసము! ఎంత లోతైన మర్మము! ఎంత ఆశ్చర్యము! లోకములో నున్నాము గనుక లోకములో నుండి ఏది అక్కర లేదంటాము! అలాగు ఎవరంటారు? అక్కరలేదంటే ఏమి తింటాము? ఏమి కట్టుతాము? ఏమి కొంటాము? ఏమి అక్కర లేదు, ఎంతగొప్ప ఆశ్చర్యము! లోకములోనున్న ఐశ్వర్యమంతా చూడగా, అంతా పెంటకుప్ప అన్నాడు పౌలు. అలాగు ఎవరంటారు? పౌలు, పెంటకుప్ప అని అన్నాడు. అట్టి అనుభవమే నాకుంటే ఎంత సంతోషము! ఎవరైనా వచ్చి, **గదిలో ఎవరున్నారంటే యేసుప్రభువును, నేనును ఉన్నాము అంటాము.** వారి

మాటలు వినబడుటలేదా అంటే లేదు. వినలేదు అంటాము. ఆ గదిలో పదిమంది ఉన్నా లేనట్టే.

అంత గొప్ప విశ్వాసము మాకు అనుగ్రహింపుము. మోషేతో- 'ఐగుప్తులో నున్న ఇశ్రాయేలీయులు దుఃఖములు నాకు తెలిసినవి' అన్నావు. ఇది బహు విచిత్రమైన వాక్యము. అది వారు విన్నప్పుడు, వారికి ఎంత సంతోషము! ప్రభువా! నా జబ్బు తీసివేయి అంటే **నాకు తెలుసును'** అన్నావు. మోషేతో కాదు, ఈ గదిలోనున్న మాతో, అనగా ఒకటి ఉండి ఒకటి లేకపోతే విసుగుకొనే మాతో, ఆ మాట చెప్పినావు గనుక అలాగే చేయుము. ఏవి అక్కరగా ఉన్నవి అంటే, 'అన్ని ఉన్నవి' అనవలెను. నీ వాక్య ప్రకారము 'నీవు నాకుండగా లోకములోనిది ఏదియు నాకక్కరలేదు. ప్రపంచములో అనేకమంది భక్తులు, (పరమ) విశ్వాసులు ఉన్నారు. అందులో ఎవరికి ఈ బైబిలు వాక్యము తెలుస్తుంది! భూ లోకములో నున్న భక్తులందరు ఈ వాక్యము చదివితే, నీ సర్వశక్తినిబట్టి ఈ అనుభవము మాకున్నదని చెప్పగలరు. **మా అనుభవము అదే.** మా తండ్రీ! మా ప్రభువు మా ప్రార్థన వినలేదు. అదిలేదు, ఇదిలేదు అని నిన్ను నిందించే అరుపులు ఎందుకు? లోకము పట్టజాలని ధన్యత, బుద్ధి నిండా ఉన్నది. లోకమునకు అది పట్టదు. 'లోకము ఈయనేరని సమాధానము నేను మీకిచ్చినాను' అని అన్నావు. తండ్రీ! ఎంత గొప్ప వాక్యము! పెంటకుప్ప, అక్కరలేదు, సమాధానము. ఈ మూడు మాటలు మమ్మును సిగ్గుపర్చుచున్నవి. నీవు మా యెడల జరిగించిన నీ కృపా కార్యములు జ్ఞాపకము తెచ్చుకుంటే మా ముఖము చిన్నపోయింది. అని నీ వాక్యములో ఉన్నది. ఇంతగొప్ప పాపికి అంత గొప్ప భాగ్యమా! అని పౌలు చిన్న బుచ్చుకొన్నాడు. మేము తగము. ఎంత గొప్ప భాగ్యము! ఎంత గొప్ప ధన్యత! అయ్యా! మీ ప్రేమ మేము గ్రహింపజాలము. 'ఎందుచేత ఈ పాపిపై ఇంత ప్రేమ! మా ప్రభువా! స్థలాంతరమునుండి వచ్చినవారి

హృదయములో నున్న కోరికలు నెరవేర్చి, నీ భక్తిని, నీ ప్రేమను బయలుపర్చుము. ఓ తండ్రీ! ఆయా జిల్లాలలోగల మాకు సంబంధించిన విశ్వాసులును, మేమందరమును ఎప్పుడైనా కూడుకోగలిగితే ఎంత సంతోషము! అప్పుడు కేవలము మహిమ సంగతులే మాట్లాడుకొనగలము. మేము అందరిని సమకూర్చుకొనలేక పోవుచున్నాము. విశాల సమయములలో, విశాల స్థలములలో, ఇది వరకు మాట్లాడుకొన్నవన్ని, మాట్లాడుకొనే సమయము దయచేయుము. అందరము కూడుకొనే సమయముగా చేసి నీ సమయమును మా సమయముగా మార్చి అనుగ్రహించుము. ఆమేన్.

# ఉపవాస దినములు ఆచరించువారికి సలహా

ఒక నెలలో ఒకరోజంతా పాపములు, అయోగ్యత, అజ్ఞానము, మందమతి, అశ్రద్ధ, సోమరితనము, అపనమ్మిక, పాపములు ఒప్పుకొనుచు. గడిపివేయవలెను. (అందులోనే తీర్మానము సమర్పణ కూడ యుండవలెను) 2వ దినమంతయు ప్రార్థన చేయవలెను. 3వ దినమున వాక్యము చదువుట యందు గడపవలెను. 4వ దినమున కేవలము కీర్తనలే పాడవలెను. 5వ దినమున స్తుతి మాత్రమే చేయవలెను. 6వ దినమున కేవలము కని పెట్టవలెను. 7వ దినమున ప్రశ్నలు వేయవలెను. 8వ దినమున పరలోక యాత్ర: మోకాళ్ళూని, 'పరలోక మహిమ చూపించండి' అని అడిగితే, ఆయన మిమ్మును పరలోకమునకు తీసికొని వెళ్ళి అంతయు చూపించును. మహిమ సింహాసనము, కిరీటములు అన్ని చూపించును.

**ఉపవాస దినములు:-** 1వ దినమున అర్థోపవాసము, అంటే ఏదో ఒకటి తిని తిననట్లు: 2వ దినమున మరియొక అర్థోపవాసము, అనగా ఉదయము కాఫీ తీసికొని మధ్యాహ్నము తిని, రాత్రి తినకుండా

యుండుట, 3వ దినమున నామక ఉపవాసము: అనగా కాఫీ మాత్రము తీసికొని ఉండుట, రాత్రికాల భోజనమువరకు 4వ రోజంతా యేమియు లేకుండా ఉండుట (మంచినీళ్ళు త్రాగవచ్చు), 5వ దినమున పూర్ణ దినోపవాసము అనగా త్రాగకూడదు, తినకూడదు, బయటకు వెళ్ళకూడదు, నిద్ర పోకూడదు, ఒకరితో ఒకరు మాట్లాడకూడదు. చుట్టాలతో, ఇతరులతో మాట్లాడకూడదు. అప్పుడు చెవులు మూసికొనవలెను, (రుమాలు కండ్లకు కట్టుకొనవలెను, చెప్పేవరకు విప్పకూడదు) ఇది చాలా కఠినము. ప్రార్థన గదిలో బెంచీలుండ కూడదు, కుర్చీలుండకూడదు. అరికాళ్ళు కడుక్కొని వచ్చి వరుసగా కూర్చుండవలెను. ఆడవారని మగవారని వివక్షత యుండ రాదు.

**6. సంభాషణ దినోపవాసము:–** అనుభవములు, దర్శనములు చెప్పుకొన వలెను. ఏ మీటింగు చేసినను మీ సొంత నోట్సు వ్రాసికొనవలెను. షరా: ఏ ఉపవాస దినమైనను, శిరస్నానముచేసి తలకు నూనె రాసుకొని, రేవుబట్టలు (ఉతికినవి) కట్టుకొని రావలెను. మగవారికి బరువైన బట్టలు, శృంగారమైన బట్టలు ఉండరాదు. వీలైనయెడల, **అందరు తెల్లని బట్టలు కట్టుకొనవలెను. ఇది పరలోక మహిమకు గుర్తు.** అంచులుకూడదు. (ఉపవాస దినకూడిక బట్టలు వేరే కుట్టించు కొనవలెను) ఇంటిలో కుండలు, సామానులు ఉండును గాన దేవాలయములో గాని, ప్రత్యేకమైన గదిలోగాని ఈ క్రమము చొప్పున చేయవలెను. ఇది స్వంత ఇంటిలో పనికిరాదు. పాపము కాకపోయిన, చెడ్డ వాడుకలుండ రాదు. అనగా పందిమాంసము తినరాదు. కోడిపుంజులను తినవచ్చునుగాని ఒక వారము రోజులు ముందుగా ఇంటిదగ్గర మేపవలెను. అన్నిటిలో శుద్ధికావలెను. తివాసి మాసి యుండరాదు. తెల్లని దుప్పటి ఉండవలెను. 7) పగలు భోజనముచేసి రాత్రి ఆరుగంటలకు మొదలుపెట్టి, ఉదయము ఆరు గంటల వరకు సన్నిధిలో ఉండవలెను.

**షరా:–** చికాగోలోని 25వ అంతస్తుమీద ఇట్టి ప్రార్థనలు చేయుదురు. 8) **నెలకొక పర్యాయము ప్రభువువద్ద సంస్కార భోజనము తీసికొనవలెను.** (పరలోకపు వారు ఎప్పుడు తయారుగా ఉంటున్నారు కాని మనమే మరచి ఉంటాము) 9) మధ్య ఒక తెరవేసి, తెర ఇవతల విశ్వాసులు ఉంటారు. తెర అవతలకు ఇద్దరో, ముగ్గురో వెళ్ళెదరు. భయము లేనివారు వెళ్ళుదురు. లేకపోతే భస్మమై పోవుదురు. అయ్యగారట్లు వెళ్ళిరి. ఆలాగు వెళ్ళుటకు పాప సంబంధమేమి ఉండకూడదు. ఆ తెర పరలోక మహిమకు ముంగుర్తు. అవన్నియైన తరువాత, ఈ తొమ్మిదవ అనుభవములోనికి రాగలము. ఇందులో మనకు సంబంధించిన బంధువులు ఆ తెరలోనికి వచ్చెదరు. తెర అవతల త్రియేక దేవుడు మాత్రమే ఉండును. **గనుక అయ్యగారు మొట్టమొదట నేర్పినవి తిరిగి అలవాటు చేయండి.**

**ప్రార్థన:–** ఓ ప్రభువా! సీనాయి కొండ దగ్గరకు వస్తేనే, జంతువులు చచ్చిపోవును, మనుష్యులు చచ్చిపోవుదురు. మనుష్యులు వస్తే, మంచి వారైనను సరే చచ్చిపోవుదురు. గనుక 'రావద్దు' అని ప్రజలకు నీవు ఆజ్ఞ ఇచ్చినావు. ఎందుకంటే, నీవు కొండమీద దిగినావు, అక్కడ నీ పాద సన్నిధి ఉన్నది. తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అనే త్రియేక దేవా! నీవక్కడ ఉన్నావు. నీ సన్నిధి కాంతియొక్క ఉడుకు, కొండమీద నుండి దిగువరకు, వేడిగాలి. తగులుచుండును. గనుక ఎవరు వచ్చినను మాడి పోవుదురు. ఎండకు నీడకును ఉండక, చొరవచేసి ఇసుకలోనికి వస్తే చీమలు బ్రతుకునా? బ్రతుకవు. నీ ప్రజలను బ్రతుకవలెనని నీవు కోరినావు గనుక, కొండ అంచు దగ్గరకు రావద్దన్నావు. ఇది నీ ప్రేమ. నీ ప్రజల ఎదుట నీకు కలిగియున్న శ్రద్ధ. కాబట్టి నీకు వందనములు.

'వారిని రావద్దంటివి', 'మోషేను రమ్మంటివి'. ఆయన నీ దగ్గర కూర్చున్నాడు, నీ ముఖము చూచుచున్నాడు. నీ మాట వింటున్నాడు.

అన్నము లేదు, నీళ్ళు లేవు. చావులేదు. మరి దగ్గరకు వస్తేనే, ఇశ్రాయేలీయులకు చావు. అయితే మోషే నీ పాదాల దగ్గర కూర్చున్నాడు. అది అద్భుతము! నీ అధిక ప్రేమ! శ్రద్ధ! నీ భక్తులను, ఏర్పాటువారిని చావనిచ్చెదవా, అది నీ నైజమునకు విరోధము, అద్భుతకరమైన రెండు కథలు ఈ కథలో ఉన్నవి. ఒకరికి చావు, ఇంకొకరికి చావులేని జీవము. బ్రతుకవలసిన జీవము కాబట్టి, మేము కూడ ఇశ్రాయేలీయుల వలె సమయానుకూలముగా నీ సన్నిధిలో కనిపెట్టి, నీ ముఖమువైపు చూచుచు, నీ స్వరము వింటూ కనిపెట్టే, సమయ ధ్యానము అనుగ్రహించుము. ఈ దినమంతయు నీవు మాతో, మేము నీతో యుండే భాగ్యము దయచేయుము. ఆమేన్.

**అనుభవములు:-**

**సహనానుభవము:-** సహింపు అనగా కష్టములను సంతోషముతో సహింపవలెను. అనగా నిందలు, శోధనలు, ప్రార్ధనకు జవాబు లేకపోవుట, ఎండ, వాన, అపజయము, కరవు, వ్యాధి, దయ్యము, దుష్టకళలు మొదలైనవి. ఇవి మన జీవిత కాలములో జరుగునప్పుడు లెక్కచేయకూడదు. 'లక్ష్యపెట్ట మిహబాధలకు' ('యెహోవా మా తండ్రిగాడ యేసుడు మాయన్నగాడా' అను కీర్తనలోని వచనము).

**స్థానానుభవము:-** ఈ అనుభవములో మనము ఎక్కడున్నను దేవుని యొద్ద ఉన్నట్టే భావించు కొందము. బురదలోయున్నను, కాలే ఇసుకలో యున్నను, నెబుకద్నెజరు యొక్క అగ్నిగుండములో యున్నను, గలిలయ సరస్సు తుఫానులో నున్నను, నరహంతకుల మధ్యనున్నను, సాధుసుందర సింగ్ వలె పాడు నూతిలో నున్నను **దేవుని ఒడిలోనున్నట్లే భావించు కొనవలెను.** ఇది మహా గొప్ప అనుభవము. క్రూర జంతువుల మధ్యనున్నను, నిర్జన ప్రదేశములో నున్నను, గాలిలో యున్నను, నిద్రావస్థలో యున్నను నా తండ్రియొద్దనే యున్నానని తలంచుకొనవలెను.

**ఐక్యానుభవము:–** ఒంటరిగా నున్నప్పుడు నేను ఒంటరిగాలేను. నా తండ్రి కలసి యున్నాము అని తలంచుకొనవలెను. ఏ పని చేసినను, నేను ఒక్కడనే చేస్తున్నానని అనుకొనవద్దు. తండ్రి, నేను కలిసి చేస్తున్నామని తలంచవలెను. శ్రమకాలములో నున్నను, నేనొక్కడనే శ్రమ అనుభవించుటలేదు. తండ్రి, కుమారుడు, నేను కలిసి అనుభవించు చున్నాము, కాడి మోయుచున్నాము అని భావించుకొనవలెను.

# ఉపవాస ప్రార్థన ప్రకరణము

ఇప్పుడైనను మీరు ఉపవాసముండి కన్నీరు విడుచుచు,
దు:ఖించుచు మన:పూర్వకముగా తిరిగి నాయొద్దకు రండి.
ఇదే యెహోవా వాక్కు. యోవేలు 2:12.

గ్రంథకర్త :

## యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు -2026 చందా : రూ/- 10.00

Bible Mission HQ Guntur

గుంటూరునందు:-

| | | | | |
|---|---|---|---|---|
| ప్రథమ | ముద్రణ | 1968 | ప్రతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1974 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1980 | ప్రతులు | 1000 |
| నాల్గవ | ముద్రణ | 2003 | ప్రతులు | 2000 |
| ఐదవ | ముద్రణ | 2008 | ప్రతులు | 5000 |
| ఆరవ | ముద్రణ | 2012 | ప్రతులు | 5000 |
| ఏడవ | ముద్రణ | 2014 | ప్రతులు | 5000 |
| ఎనిమిదవ | ముద్రణ | 2017 | ప్రతులు | 5000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2019 | ప్రతులు | 2000 |
| పదవ | ముద్రణ | 2022 | ప్రతులు | 3000 |
| పదకొండవ | ముద్రణ | 2024 | ప్రతులు | 1000 |
| పన్నెండవ | ముద్రణ | 2025 | ప్రతులు | 1000 |
| పదమూడవ | ముద్రణ | 2026 | ప్రతులు | 1000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలుపరచిన

# బైబిలు మిషను ప్రచురణ

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.

# ప్రశంస

**ఉపవాస ప్రార్థన ప్రకరణము** అను ఈ చిన్న పుస్తకములోని అంశములను దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు బోధించిరి. ఉపవాసము అనగా 'ప్రత్యేకముగా జీవించుట' అని అర్థము. అనగా ఒక ప్రత్యేక స్థలమును ఏర్పర్చుకొని. దేవునితో ఏకాంతముగా గడుపుట, ఉపవాస ప్రార్థన ప్రకరణము అనగా దేవునితో ఏకాంతముగా గడుపుటకు ఉద్దేశింపబడిన ప్రార్థనా క్రమము. ఎవరైననుసరే, ఈ క్రమమును అనుసరించిన యెడల తమ ఆత్మీయ జీవితమును చక్కదిద్దుకొని, శ్రేష్ఠుడైన భక్తుల వరుసకు సిద్ధపడగలరు. తమ పనిలో చురుకుతనము, ఉద్రేకము కావలెనని కోరుకొనెడి దైవసేవకులు మరియు విశ్వాసులు తప్పక ఈ క్రమమును పాటించి, అందులోని అనుభవములను అందుకొన వలసినదే. ఏ మతము వారైనను, ఈ పుస్తకములోని పద్ధతులను ఆచరించగలిగిన యెడల మహిమ అంతస్తునకు చేరుకోగలరు. సార్వత్రిక క్రైస్తవ సమాజములో తయారగుచున్న వధువు సంఘ ప్రయోజ నార్థమైన, ఈ అంశములను దైవజనులు 1935, 1936 సం॥లలో, ఆయా కూటములలో ప్రార్థించి, తనతో ఉన్నవారి అనుభవములలో ఉంచిరి. ఇందులో 1.ఉపవాస ప్రార్థన వాక్యములు, 2. ప్రార్థన ఆరంభించు విధము, 3. పది ఆజ్ఞల వివరము, 4. ప్రార్థనమెట్లు, 5. విజ్ఞాపన ప్రార్థనాంశములు, 6. దైవ లక్షణముల స్తుతి, 7. వాక్యమువిప్పు ప్రార్థనలు, 8. మరి ఇతర ప్రార్థనలు, 9. విమోచన ప్రార్థనలు, 10. ఉపవాసము చేయు విధములు, వివిధ అనుభవములు గలవు.

ఇవి అంతరంగ జీవిత పరిపూర్ణతకు ఉద్దేశించబడినవి. అంతేకాక భక్తి జీవితములో మహోన్నతస్థితికి నడిపించునవి గనుక చదువరులెల్లరూ ఈ పుస్తకములోని అంశములను, తమ అనుభవములోనికి తెచ్చుకొనుటకు విశ్వాసముతో ప్రయత్నించవలెను. ఇంకను మరుగుగా ఉన్న దైవజనుని ఉపదేశములు, క్రమములు, అనుభవములు ఈ రీతిగా వెల్లడి అగునట్లు ప్రార్థించవలసినదిగా మనవి. చేయుచున్నాము.

ఇట్లు

**త్వరగా వచ్చుచున్న పెండ్లికుమారునియందు**

**రెవ. జె. శామ్యేల్ కిరణ్**

ప్రెసిడెంట్, బైబిలు మిషను.

# ఉపవాస ప్రార్థన వాక్యములు

1) ఆది. 37:34–35; 50:10. 2) నిర్గమ. 24:18; 34:28. 3) లేవీ. 16:29–31: 23:27–29; 16:24; 23:26–32, 4) సంఖ్యా. 29:7: 20:29. 5) ద్వితీ. 9:9,18. 6) యెహోషువ. 7:6–8. 7) 2 సమూ. 1:7; 1:10–15, 20, 7:6, 31:13. 8) న్యాయాధి. 11:30,39, 20:26. 9) 2 సమూ. 1:12; 3:35; 12:17–20,23. 10) 1 రాజులు 21:27; 19:5. 11) 1దిన. 10:12. 12) 2 దిన. 20:3. 13) ఎజ్రా 10:1–6. 14) నెహెమ్యా 9:1–4. 15) ఎస్తేరు 4:16. 16) దా॥ కీర్తనలు 25వ అధ్యాయము, 107వ అధ్యాయము. 17) దా॥ కీర్తనలు 51వ అధ్యాయము: 35:13. 18) యెషయా 58:2–8; 22:12. 19) యిర్మీయా 9:1–2; 14:12; 36:6; 36:9. 20) విలా 2:10–18. 21) యెహెజ్కేలు 27:30; 3:15. 22) దానియేలు 10:2–4; 9:3; 9:8. 24) హోషేయా 4వ అధ్యాయము. 25) యోవేలు 1:14; 2:12 2:15. 25) యోనా 3:5–10,26. మీకా 4వ అధ్యాయము. 27) జెకర్యా 7:3, 8:18–23. 28) మలాకి 3:14. 29) మత్తయి 4:2–16, 6:16; 9:14,15. 30) మార్కు 1:11–13: 2:18; 9.29. 31) లూకా 2:37; 4:1–2; 5:33–35; 18:12. 32) అపో.కార్య 13:2,3; 14:23, 27:9. 33) 2కొరింథీ 6:5; 11:27.